అమ్మవారి ఆలయాలకు పోటెత్తి..

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం
- సామూహిక కుంకుమార్చనలు

పొదలకూరు: మండలంలోని పలు దేవాలయాల్లో శుక్రవారం వరలక్ష్మీవ్రత పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మహిళా భక్తులు సామూహిక కుంకుమార్చనలో పాల్గొని వ్రతాన్ని ఆచరించారు. 60 వేల గాజులతో అమ్మవారిని అలంకరించారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు. సంగం మార్గం తోడేరు పార్వతీదేవి దేవస్థానంలో వ్రతం వైభవంగా జరిగింది. మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. శ్రీకన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో వరలక్ష్మీవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోపూజ, అభిషేకాలు, సమస్ర కుంకుమార్చన జరిపారు. అయ్యప్పనగర్ శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు జరిగాయి. మరుపూరు శ్రీకామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. వైస్ ఎంపీపీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- **తోటపల్లిగూడూరు:** మండలంలోని వరిగొండలో జ్వాలాముఖి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. చందనాలంకారం, లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అలాగే నరుకూరులోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో, జానావారి పాళెంలోని వరలక్ష్మి అమ్మవారి ఆలయంలో పూజలు జరిగాయి.


పొదలకూరు : 60 వేల గాజులతో అలంకారం

- **ఇందుకూరుపేట:** శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి అమ్మవారు పసుపు కొమ్ముల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి మూలవిరాట్‌తో పాటు ఆలయాన్ని ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో అలంకరించారు. ఉభయకర్తలుగా రాముడుపాళేనికి చెందిన తోటపల్లి శేషమ్మ కుమారుడు వంశీధర్– కోడలు లహరి వ్యవహరించారు. తొలుత అర్చకులు అనిల్‌స్వామి, రామకృష్ణస్వామి, కిశోర్‌స్వామి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు సామూహిక కుంకుమార్చన చేపట్టారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. రాత్రి అమ్మవారికి పల్లకిసేవ జరిపారు. కార్యక్రమాలకు పుటికం నాగేశ్వరరెడ్డి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు వ్యవహరించారు.


టీపీగూడూరు : జ్వాలాముఖి అమ్మవారి ఆలయంలో..

మైపాడు శివాలయంలో అర్చకుడు బండారం ప్రభాకర్‌శాస్త్రి ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రతం ఘనంగా జరిగాయి.

- **మనుబోలు:** స్థానిక విష్ణాలయంలో మహిళలు వరలక్ష్మీవ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు హనుమాచార్యులు వేకువజామున పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. అలాగే కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.
- **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** మండలంలోని జొన్నవాడ గ్రామంలో కొలువైన కామాక్షితాయి ఆలయంలో సామూహిక వరలక్ష్మీవ్రతం శుక్రవారం వేడుకగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.


పొదలకూరు : వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో..


పొదలకూరు : ప్రత్యేకాలంకరణలో పార్వతీదేవి


పొదలకూరు : మరుపూరులో..


ఇందుకూరుపేట: చాముండేశ్వరి ఆలయంలో..


మనుబోలు : ప్రత్యేకాలంకరణలో పోలేరమ్మ


మనుబోలు : విష్ణాలయంలో సామూహిక కుంకుమపూజ


బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కామాక్షితాయి ఆలయంలో..

క్లుప్తంగా

పట్టణంలో అభయాంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటు



పొదలకూరు: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా 12 అడుగుల ఏకశిల అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నిర్మాణ పనులు పూర్తి చేసి త్వరలో ప్రతిష్టా మహోత్సవం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు. అంజనేయస్వామి విగ్రహం నిలుపుదల సందర్భంగా గురువారం రాత్రి పట్టణంలో శోభాయాత్రను నిర్వహించారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అట్టహాసంగా గంగమ్మ కొలుపు



పొదలకూరు: పట్టణంలోని గంగమ్మతల్లి దేవస్థానంలో శుక్రవారం కొలుపు అట్టహాసంగా ప్రారంభమైంది. మూడురోజులపాటు కొలుపును నిర్వహిస్తామని దేవస్థానం కమిటీ పేర్కొంది. తొలిరోజున ఉదయం 7:30 గంటలకు కుంకుమపూజ, అభిషేకం, సహస్రనామార్చన, మధ్యాహ్నం 2 గంటలకు ఆచారం తెలియజేయడం, సాయంత్రం 3 గంటలకు అమ్మవారి పూజా కార్యక్రమం నిర్వహించారు. తొలిరోజు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విచ్చేసి పూజల్లో పాల్గొన్నారు.

రాఖీ వేడుకలను సంతోషంగా జరుపుకోవాలి


ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: కోవూరు నియోజకవర్గ ప్రజలకు రాఖీ పండగ శుభాకాంక్షలను మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆత్మీయ బంధానికి, అనురాగానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండగను ప్రతిఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

భద్రకాళమ్మకు పొంగళ్ల సమర్పణ రేపు

పొదలకూరు: మండలంలోని మొగళ్లూరు గ్రామంలో ఉన్న భద్రకాళమ్మకు ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెడతారని గ్రామపెద్దలు శుక్రవారం వెల్లడించారు. ఉదయం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం గ్రామ పొంగళ్ల కార్యక్రమం, రాత్రి అన్నదానం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాల్సిందిగా కోరారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన పథకానికి ఉదయగిరికి చెందిన కప్పె పెంచలరాజు రూ.1,23,456 నగదును విరాళమిచ్చారు. శుక్రవారం ఆ మొత్తాన్ని అందించినట్లు ఆలయ ఏసీ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. దాతలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

కండలేరులో 25.481 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 25.481 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 3,550 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,300, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 90, మొదటి బ్రాంచ్ కాలువకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

రేపు డ్యాన్స్, పాటల పోటీలు

నెల్లూరు(బృందావనం): పురమందిరంలో ఆదివారం 'బిగ్ వేవ్ ఈవెంట్స్' 17 వసంతాల విజయోత్సవ వేడుకల్లో భాగంగా పాటలు, డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ వై.రవిబాబాబు తెలిపారు. కేవీఆర్ పెట్రోలు బంక్ దగ్గర ఉన్న చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో ఆహ్వానపత్రికలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్తమాన కళాకారులను ప్రోత్సహించాలన్న సంకల్పంతో ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే శాస్త్రీయ, వెస్ట్రన్ విభాగాల్లో డ్యాన్స్, పాటల పోటీలు జరుపనున్నామన్నారు.

ఆర్టీసీ బస్సు సర్వీస్ ప్రారంభం

పొదలకూరు: ముత్తుకూరు నుంచి వయా గుమ్మళ్ల దిబ్బ మీదుగా గూడూరుకు నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును శుక్రవారం బీజేపీ మండల నాయకులు ప్రారంభించారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డిని కలిసి బస్సు సర్వీస్ విషయమై వివరించడం జరిగిందని, వెంటనే ఆయన స్పందించి సర్వీసును కేటాయించినట్లు సాగునీటి సంఘం అధ్యక్షుడు కాకుటూరు రవీందర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు సంపత్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో ఈపూరు శివ, సాయిరెడ్డి, విజయ్, శ్రావణ్, పవన్, భార్గవ్, వెంకటేష్, లోకేశ్ పాల్గొన్నారు.


బస్సుసర్వీసును ప్రారంభించిన దృశ్యం

వామ్మో.. శునకాలు

తోటపల్లిగూడూరు: మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో కుక్కల బెడద అధికమైంది. 22 పంచాయతీల్లోని 74 మజారా గ్రామాల్లో పెద్ద సంఖ్యలో ఉన్న కుక్కలు స్థానికులను భయపెడుతున్నాయి. కొత్తపాళెం, కోడూరు, మండపం, వరిగొండ, ఈదూరు, సాలిపేట, నరుకూరు, తోటపల్లిగూడూరు గ్రామాల్లో వాటి బెడద అధికంగా ఉన్నట్లు స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


వీధిలో ఇలా..

'అప్పులపాలయ్యాను.. నన్ను వెతకొద్దు'

నెల్లూరు(క్రైమ్): ఓ వృద్ధుడు అప్పులపాలయ్యారు. తనను వెతకొద్దని లెటర్‌రాసి ఎటో వెళ్లిపోయారు. పోలీసుల సమాచారం మేరకు.. కామాటివీధిలో రామచంద్రన్ నివాసం ఉంటున్నారు. ఆయన వీఆర్సీ సెంటర్‌లో ఫ్యాన్సీషాపు నిర్వహిస్తున్నారు. గతనెల 27వ తేదీన ఆయన ఇంటి నుంచి బయటకు వెళ్లారు. కుటుంబ సభ్యులు ఆయన కోసం గాలించినా జాడ తెలియరాలేదు. షాపులో వెతుకగా ఓ లెటర్ లభ్యమైంది. అందులో 'నేను అప్పులపాలయ్యాను.. నన్ను వెతకొద్దు.. వెళ్లిపోతున్నా..' అంటూ రాసి ఉంది. ఈ మేరకు కుటుంబసభ్యులు శుక్రవారం చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): రెడ్‌క్రాస్ కార్యాలయం ముందు నిలిపి ఉన్న ఆటో చోరీకి గురైంది. వివరాల్లోకి వెళ్తే.. వెంకటాచలం మండలంలోని జోసఫ్‌పేట గ్రామంలో అంటోని నివాసం ఉంటున్నారు. ఆయన ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ ఏడాది మే 2వ తేదీన ఆయన తన ఆటోలో నెల్లూరు వచ్చారు. ఏసీ కూరగాయల మార్కెట్ సమీపంలోని రెడ్‌క్రాస్ గేటు వద్ద ఆటోను పార్క్ చేశారు. అనంతరం మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేసి బయటకు వచ్చిచూడగా ఆటో కనిపించలేదు. అప్పటి నుంచి బాధితుడు ఆటో కోసం గాలించారు. ఫలితం లేకపోవడంతో శుక్రవారం చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్‌బైక్‌ను ఢీకొన్న కారు

- ఒకరికి తీవ్రగాయాలు

పొదలకూరు: సంగం – పొదలకూరు రోడ్డులో పట్టణానికి సమీపంలోని అయ్యగారిపాళెం రోడ్డు మలుపు వద్ద శుక్రవారం మోటార్‌బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మూలి సుందరరామిరెడ్డి (53) బైక్‌పై పొదలకూరుకు వస్తుండగా తిరుమల నుంచి కలిగిరికి వెళుతున్న కారు మలుపు వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుందరరామిరెడ్డి కాలు విరిగింది. భుజానికి కూడా గాయమైంది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొడవలూరు: మండలంలోని కొత్తవంగల్లు, గండవరం, యల్లాయపాళెం, పద్మనాభసత్రం, రామన్నపాళెం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఆ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఎం.రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

- **ఇందుకూరుపేట:** మండల పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేంద్రబాబు తెలిపారు.

రాగి వైర్ల చోరీ

నెల్లూరు సిటీ: మొగళ్లపాళెం గ్రామానికి చెందిన కె.రాజేష్ పొలంలో 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీ చేశారు. దీనిపై బాధితుడు శుక్రవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఉద్దేశపూర్వకంగా దౌర్జన్యం చేస్తున్నారు'

ఇందుకూరుపేట: తనపై చీమకుర్తి శ్రీనివాసులురెడ్డి అనే వ్యక్తి ఉద్దేశపూర్వకంగా అసత్య ఆరోపణలు చేస్తూ దౌర్జన్యం చేస్తున్నాడని వైఎస్సార్‌సీపీ నేత, మైపాడు సర్పంచ్ సంగం వెంకయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన తన నివాసంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. శ్రీనివాసులురెడ్డి ఓ యూట్యూబ్ చానల్ ద్వారా అందరినీ బెదిరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. ఈ క్రమంలో పంచాయతీలో అవినీతి జరిగిందని అతను అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై వారు విచారణ జరిపి ఎలాంటి అవినీతి జరగలేదని తేల్చి చెప్పడంతో ఓర్వలేక తనపై దౌర్జన్యానికి దిగుతున్నాడన్నారు. అతనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇండ్ల రమణయ్య, నరేష్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సంగం వెంకయ్య

కుటుంబ సభ్యుల చెంతకు వృద్ధుడు

కోవూరు: మానసిక సమస్యలతో తప్పిపోయిన వృద్ధుడిని కోవూరు పోలీసులు రక్షించి కుటుంబసభ్యులకు అప్పగించిన ఘటన శుక్రవారం వెలుగుచూసింది. మర్రిపాడు మండలానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి కొంతకాలంగా మానసిక సమస్యతో బాధపడుతున్నారు. గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆయన తన కుమార్తెతో కలిసి నెల్లూరు పొగతోట ప్రాంతంలో వైద్యం కోసం వచ్చారు. ఈ క్రమంలో ఆయన తప్పిపోవడంతో వారు పలుచోట్ల గాలించారు. ఫలితం లేకపోవడంతో కోవూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై రంగనాథ్‌గౌడ్ తన సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి 12.30 గంటల సమయంలో గుర్తించి సురక్షితంగా కుటుంబసభ్యులకు అప్పగించారు.



ఆత్మీయ బంధానికి ప్రతీక రాఖీ


అమ్మకానికి సిద్ధంగా రాఖీలు

కోవూరు: అన్నా చెల్లెళ్లు.. అక్కా, తమ్ముళ్ల ఆత్మీయ బంధానికి చిహ్నంగా జరుపుకొనే పండగ రక్షాబంధన్. రక్తసంబంధీకులు లేకున్నా.. మన కోసం అండగా నిలిచే ఆప్తుల్ని సమాజం అందిస్తుంది. అలాంటి వారికి కూడా రాఖీ కట్టి సోదరభావాన్ని పెంపొందించుకోవడానికి రక్షాబంధన్ మంచి సందర్భం.

ట్రెండ్‌కు తగినట్లు రాఖీల అమ్మకాలు

ప్రస్తుత ట్రెండ్‌కు తగినట్లు రాఖీల అమ్మకాలు జోరందుకున్నాయి. సోదరుడి పేరు, ఫొటోలతో కూడా రాఖీలు తయారు చేస్తున్నారు. అలాగే రుద్రాక్షలు, వివిధ రకాల దేవుడి బొమ్మలు, బ్రేస్‌లేట్ రాఖీలు ఆన్‌లైన్లో అందుబాటులో ఉన్నాయి. శనిరవారం రాఖీ పండగను పురస్కరించుకుని కోవూరు పట్టణంలో విరివిగా దుకాణాలు ఏర్పాటలయ్యాయి. రూ.25 నుంచి రూ.500 వరకు రాఖీలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి.

పోస్టు ద్వారా పంపుతా



మేము నెల్లూరులో ఉన్న సమయంలో ఏటా మా సోదరులందరికీ రాఖీలు కట్టడం అలవాటుగా ఉండేది. ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నా ఏటా రక్షాబంధన్ రోజు రాఖీలను కోవూరు మండలం పడుగుపాడు గ్రామానికి పోస్టు ద్వారా పంపుతున్నాం.

– ఈదూరు శైలజా– అజయ్ దంపతులు, అమెరికా

రాఖీ కడితే సంతోషంగా ఉంటుంది



రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రతి ఏడాది మా తమ్ముడికి రాఖీ కడతాను. నేను తిరుపతిలో చదువుకుంటున్నా.. రక్షాబంధన్ రోజు వచ్చి రాఖీ కట్టి వెళ్తాను. ఇది చాలా సంతోషాన్ని ఇస్తుంది.

– గంగపట్నం శ్రావ్య, పడుగుపాడు, కోవూరు

జాగ్రత్తగా లేకుంటే ప్రమాదమే

- గుంతలమయంగా పెన్నా తీరం
- లోతు తెలియక మృత్యుఒడికి..

కోవూరు: సరదా కోసం.. చేపలు పట్టేందుకు.. పశువులు తోలేందుకు పెన్నానదిలో దిగుతున్న వారు మృత్యువాత పడుతున్నారు. ఇటీవల ఇలాంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. కోవూరు నియోజకవర్గ పరిధిలో విస్తారంగా పెన్నా నది ప్రవహిస్తోంది. అయితే నది పరీవాహక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ తవ్వకాల వల్ల నదిలో ఎక్కడబడితే అక్కడ గుంతలు ఏర్పడుతున్నాయి.

అక్రమ తవ్వకాలు

కూటమి ప్రభుత్వంలో పెన్నా నదిలో అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతున్నాయి. నెల్లూరు సహా అనేక ప్రాంతాల నుంచి భారీగా ట్రాక్టర్లు, టిప్పర్లు నియోజకవర్గ పరిధిలో పెన్నా నది నుంచి ఇసుక తవ్వకాలు చేసి, సరఫరా చేస్తున్నారు. ఇలా అక్రమ తవ్వకాల వల్ల ఏర్పడిన ప్రమాదకర గుంతలు వర్షాకాలంలో ప్రాణాలను తీస్తున్నాయి. ఈ సమస్య చాలా ప్రాంతాల్లో కనిపిస్తోంది. ముఖ్యంగా కోవూరు నియోజకవర్గంలో ఇసుక అక్రమంగా తవ్విన ప్రదేశంలో వర్షం వచ్చినప్పుడు ఆ గుంతలు కనిపించడం లేదు. దీంతో వాటి లోతు తెలియక యువత, పెద్దలు నీటిలో పడి ప్రాణాలు కోల్పోతున్నారు.


ఇటీవల గల్లంతైన యువకుడి కోసం చేపట్టిన గాలింపు చర్యలు (ఫైల్)


చేపలవేటకు వెళ్లి చనిపోయిన గిరిజనుడు (ఫైల్)

ఇలా చేయాలి

అక్రమ ఇసుక తవ్వకాన్ని అధికారులు నిలువరించాలి. అనుమతుల్లేకుండా నదిలో తవ్వకాలు చేపడుతున్న వారిపై కేసులు నమోదు చేసి జైలుపాలు చేయాలి. అధికారులు రాత్రి వేళ్లలో నిఘా ఉంచాలి. అలాగే లోతు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. యువకులను నీటిలోకి వెళ్లకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.

ఏడాదిగా జరిగిన ఘటనలు

- ఈనెల 4న కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం సమీపంలో పల్లెపాళెం వద్ద ఏడుగురు యువకులు ఈత కోసం నదిలోకి దిగారు. ఇందులో ఓ యువకుడు నదిలో చిక్కుకుని చనిపోయారు.
- గత డిసెంబర్ 30న జమ్మిపాళెం వద్ద ఓ మహిళ పశువులను తోలుకునేందుకు వెళ్లి పెన్నానదిలో పడి మృతిచెందింది.
- గత అక్టోబర్ 27న జమ్మిపాళెం వద్ద ఓ గిరిజనుడు చేపలు పట్టేందుకు వెళ్లి గుంతలో పడి మరణించారు.